నేడు రైసుమిల్లర్లతో మంత్రి నాదెండ్ల సమీక్ష

నడకుదురులో గోదాముల తనిఖీ

» మంత్రి ఆదేశాలతో రూ.13.50కోట్ల సరుకు సీజ్

కోట్లకు కోట్లు బొక్కేశారు





కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. హాజరైన కలెక్టర్ షాన్ మోహన్, ఎంపీ తంగెళ్ల ఉదయ్, ఎమ్మెల్యేలు వనమాడి, నానాజీ, సత్యప్రభ

- వైసీపీ ప్రభుత్వంలో భారీగా రేషన్ బియ్యం కుంభకోణం జరిగింది
- బియ్యం అక్రమ తరలింపు ద్వారా ద్వారంపూడి వేలకోట్ల దోపిడీ
- కిలో రూ.7కు కొనుగోలు చేసి ఇతర దేశాలకు భారీగా ఎగుమతులు
- రేషన్ బియ్యం సరఫరా, విక్రయ మాఫియాపై ఇకపై ఉక్కుపాదం
- అధికారులు పద్ధతి మార్చుకుని పనిచేయకపోతే ఊరుకునేది లేదు
- పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి నాదెండ్ల
- జిల్లాలో కౌలురైతుల నమోదులో పక్షపాతం కనిపిస్తోందని ఆగ్రహం
- గోధుమపిండికి డిమాండ్ ఉన్నా ఎందుకు పంపిణీ చేయలేదని నిలదీత
- మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశాలు
- సూటిగా ఆధారాలతో అధికారులను నిలదీస్తూ బెంబేలెత్తించిన మంత్రి
- బియ్యం గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు.. కొన్నింటికి సీజ్ ఆదేశాలు
- మంత్రి తనిఖీలు, ఊహించని ప్రశ్నలతో అధికారులు ఉక్కిరిబిక్కిరి
- ఐదేళ్ల తర్వాత ప్రభుత్వ సమీక్ష సమావేశానికి మీడియాకు అనుమతి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్, జూన్ 28: సూటిగా.. స్పష్టంగా.. ఆధారాలతో అధికారులపై ప్రశ్నల బాణాలు.. గత వైసీపీ ప్రభుత్వంలో బియ్యం దోపిడీ, అరాచకాలకు ఎందుకు సహకరించారంటూ నిలదీతలు.. ప్రజలు, రైతుల అవసరాలు పట్టించుకోకుండా గత పాలకుల సేవలో తరించడం ఏంటంటూ నిప్పులు.. కౌలు రైతులంటే అంత వివక్ష ఏంటంటూ వరుస ప్రశ్నలు.. ప్రజలంతా గోధుమపిండి కావాలని అడుగుతున్నా ఎందుకు పట్టించుకోలేదంటూ చురకలు.. బియ్యం గోదాముల్లో లెక్కల్లో వ్యత్యాసాలపై అక్కడికక్కడే అధికారులకు అక్షింతలు.. తక్షణం సీజ్ చేయాలంటూ ఆదేశాలు.. కొత్త ప్రభుత్వంలో రేషన్‌బియ్యం అక్రమ మాఫియాకు తావు లేదంటూ సూటిగా ఆదేశాలు.. ఇదీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనలో భాగంగా అధి కారులపై నిప్పులు కక్కిన తీరు. సూటిగా, సుత్తిలేకుండా పాయింట్లపై పాయింట్లతో ఆధారాలు చూపించి మరీ అధికారును నిలదీసి ఉక్కిరిబిక్కిరి చేశారు. వీటన్నింటికీ అధికారులు నీళ్లు నమలడం మినహా ఏ ఒక్కదానికి సమాధానం చెప్పలేక నోరెళ్లబెట్టారు. ఐదేళ్లతర్వాత తొలిసారిగా పౌరసరఫరాలశాఖ మొద్దునిద్రను ప్రశ్నిస్తూ మంత్రి నాదెండ్ల సమీక్ష నిర్వహించడం విశేషం.

ద్వారంపూడి దోపిడీకి అంత సహకారమా..

జిల్లా పౌరసరఫరాలశాఖ మంత్రి హోదాలో నాదెండ్ల మనోహర్ శుక్రవారం ఉదయం 11.15గంటలకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులో కూలంకుష సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ముందుగానే మంత్రి జిల్లాలో ఆశాఖలో జరుగుతోన్న బాగోతం, గత వైసీపీపాలనలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన మంత్రి దానికి తగ్గట్టుగానే సమీక్షను వాడీవేడిగా ప్రారంభించారు. పౌరసరఫరాల సంస్థ ఎండీ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, టీడీపీ ఎమ్మెల్యేలు కొండబాబు, సత్యప్రభ, ఎంపీ ఉదయశ్రీనివాస్ తదితరులు పాల్గొన్న ఈసమీక్ష మొత్తం వాడీవేడిగా జరిగింది. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారుల ప్రణాళికలు ఎలా ఉన్నాయో అడిగితెలుసుకున్న మంత్రి ఆతర్వాత రేషన్ బియ్యం సరఫరా, నిల్వలు అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా గత వైసీపీ ప్రభుత్వం, అధికారుల తీరుపైనా తీవ్రస్థాయిలో మంత్రి నిప్పులు కక్కారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి రేషన్ బియ్యాన్ని అడ్డదారిలో ఇతర దేశాలకు తరలించి కోట్లు సంపాదించారని ధ్వజమెత్తారు. ద్వారంపూడి కుటుంబం చిత్తూరు నుంచి కాకినాడ వరకు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేసుకుని రేషన్ బియ్యాన్ని దొడ్డిదారిలో తరలించిందని విమర్శించారు. కిలో రేషన్ బియ్యాన్ని రూ.7 నుంచి రూ.10 వరకు లబ్ధి దారుల నుంచి కొనుగోలు చేసి విదేశాలకు తరలించి వేలకోట్లు సంపాదించారని ధ్వజమెత్తారు. దీనిపై విచారణ చేసి వాస్తవాలను వెలుగులోకి తెస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 90వేల హెక్టార్లలో సాగుకు అవకాశం ఉన్నందున చిరుధాన్యాలను ఎక్కువగా పండించాలని వ్యవసాయశాఖ జేడీని ఆదేశించారు. ఈ సందర్భంగా గత సీజన్లో నమోదైన ఈక్రాప్ బుకింగ్‌శాతం,ధాన్యం సేకరణలో ఆర్‌బీకేలు, మిల్లుల వద్ద రైతులు ఎదుర్కొన్న ఇక్కట్లపై మంత్రి ఆరా తీశారు. గత సీజన్‌లో ధాన్యం కొనుగోలు సందర్భంగా తేమ నిర్ధారణలో మోసపోయిన రైతులనుంచి ఫిర్యాదుల స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. రైతులను మోసం చేసిన మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, గోనెసంచులు సరఫరా చేస్తామని, అవసరం ఎంతనే దానిపై నివేదిక పంపాలని సూచించారు.

కౌలు రైతుల గుర్తింపులో పక్షపాతమేంటి?

జిల్లాలో కౌలురైతుల గుర్తింపులో గత ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరించింది. దీనివల్ల కౌలురైతులు ప్రభుత్వం నుంచి పొందాల్సిన రాయితీలను పొందలేకపోయారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి తలెత్తకూడదని హెచ్చరించారు. జిల్లాలో నిజమైన కౌలురైతులను గుర్తించి వారికి రుణాలనుంచి సబ్సిడీలపై విత్తనాల వరకు అన్నీ అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 80వేల మంది కౌలురైతులు ఉంటే కేవలం 56వేల మంది రైతులనే కౌలు రైతులుగా గుర్తించడం ఏంటని ప్రశ్నించారు. గత మేలో జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు తగినంత గోధుమపిండి రేషన్‌కార్డుదారులకు ఇవ్వాలి. కానీ ఎందుకు ఇవ్వలేదని అధికారులను మంత్రి నాదెండ్ల ప్రశ్నించారు.

తేడాలుంటే కేసులు పెట్టండి..

జిల్లాలో వసతిగృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో ఆహార నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. నాసిరకం ఆహారం విద్యార్థులకు అందిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై సీఎస్‌డీపీలు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ పరిధిలో ఉన్న ఎండీయూ వాహనాలను అధికారులు తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పంపిణీలో ఎలాంటి తేడాలు గుర్తించినా వెంటనే 6ఏ కేసులు నమోదు చేయాలని సూచించారు. రేషన్ బియ్యం పంపిణీ, మధ్యాహ్న భోజనం పథకం అమల్లో వివిధశాఖల అధికారుల మధ్య సమన్వయలోపం ఉండడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పీడీఎస్ సరుకులను రవాణా చేసే వాహనాలపై రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో కొత్త రేషన్‌కార్డులు, కార్డుల విభజన కోసం ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ఇవ్వాలని ఆదేశించారు. తీరప్రాంతాల్లో మత్స్యకార కుటుంబాలకు అదనపు సరుకులు అందించే కొత్త పథకానికి ప్రతిపాదనలు పంపాలన్నారు.



కాకినాడలోని ఓ బియ్యం గోదాములో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్





కాకినాడ పోర్టు రోడ్డులోని గోదాములో బియ్యం నాణ్యత పరిశీలిస్తున్న పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. (ఇన్‌సెట్)లో నాణ్యతలేని బియ్యం

రేషన్ బియ్యాన్ని విదేశాలకు

తరలిస్తే కఠిన చర్యలు

- కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, తాళ్లరేవుల్లో బియ్యం గోదాముల్లో మంత్రి నాదెండ్ల తనిఖీలు
- 7చోట్ల పీడీఎస్ బియ్యం రీసైకిలింగ్ గుర్తింపు
- సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేయాలని మంత్రి ఆదేశం

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 28: పేదలకు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి విదేశాలకు తరలించే వారిపై సమగ్ర విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కాకినాడ జిల్లాలో పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన రాష్ట్ర పౌరసరఫరాల వీసీ, ఎండీ వీరపాండ్యన్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాలు, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల అధికారులతో కలిసి కాకినాడ పట్టణం పరిధిలోని పోర్టు ఏరియా, కాకినాడ రూరల్, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని బియ్యం గోదాములు, ఆగ్రో ఇండస్ట్రీలను తనిఖీ చేసి నమూనాలను సేకరించారు. కాకినాడ పోర్టు ఏరియాలో ఉన్న విశ్వప్రియ బియ్యం గోదాము, రవీంద్ర బియ్యం గోదాము, మానస ఎక్స్‌పోర్ట్, డీఎస్ఎన్ బియ్యం గోదాము, కరప మండలం నడకుదురులోని లావన్ ఇంటర్నేషనల్ బియ్యం గోదాము, చొల్లంగిలోని సరళ ఫుడ్స్, తాళ్లరేవు మండలం యానాం రోడ్డు చొల్లంగిలోని విష్ణు పట్టాభిరామ ఫుడ్స్ ఆగ్రో ఇండస్ట్రీ, చొల్లంగి విశ్వగోదాములు, తూరంగిలోని వీఎస్‌రాజు సన్స్ తదితర బియ్యం గోదాములను అధికారులతో కలిసి బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రెండురోజుల కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా ఉదయం నుంచి 10 బృందాలు కాకినాడ పట్టణం, కాకినాడ గ్రామీణం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం నిల్వల కేంద్రాలను తనిఖీలు చేస్తామన్నారు. పేదలకు రేషన్‌షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి అక్రమంగా విదేశాలకు తరలించే వారిపై సమగ్ర విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని నూటికి నూరుశాతం నిజాయితీగా చేరేలా కృషి చేస్తామన్నారు. తనిఖీలు నిర్వహించిన పది ప్రాంతాల్లో ఏడు చోట్ల పీడీఎస్ బియ్యం రీసైకిలింగ్ చేస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయన్నారు. వీరందరి మీద సెక్షన్ 6ఏ, లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ ప్రాంతాన్ని మాఫియాకు అడ్డాగా తయారు చేశారన్నారు. 2019-2024 మధ్య చాలా మార్పు చోటు చేసుకుందన్నారు. పీడీఎస్ బియ్యానికి సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేయడం ప్రారంభించామన్నారు. నమూనాలు సేకరించి ఆధారాలు దొరికిన చోట స్టాక్ సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖలు సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తనిఖీలు భవిష్యత్తులో కొనసాగుతాయన్నారు. ఈ పర్యటనలో లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ రామ్‌కుమార్, సుధాకర్, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్‌రావు, పౌరసరఫరాల సంస్థ డీఎం బాలసరస్వతి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ఎందుకు వెనకబడ్డారు?

జిల్లాలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో గత ఖరీఫ్, రబీ సీజన్‌లో ధాన్యం సేకరణలో ఎందుకు లక్ష్యాలను చేరుకోలేదని మంత్రి నాదెండ్ల అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే ధర కంటే బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు లభించడం వల్ల ఆశించినస్థాయిలో ధాన్యం సేకరించలేకపోయామని అధికారులు బదులిచ్చారు. ఇకనుంచి పరిస్థితి మారాలని ధాన్యం సేకరణలో లక్ష్యాలను చేరుకోవాలని మంత్రి సూచించారు. ఇక నుంచి కార్డుదారులకు పారదర్శకంగా సరుకులు అందాలన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పాలన నిజాయితీగా జరుగుతుందని, ఇక నుంచి రేషన్‌కార్డుదారులందరికీ పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. అక్రమాలకు చెక్ పెట్టి కొత్త విధానాలతో కార్డుదారులకు సరుకులు చేరవేస్తామన్నారు.

ఆకస్మిక తనిఖీలతో హడల్..

సమీక్ష అనంతరం మంత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి. తనిఖీలు ఎక్కడో కూడా చెప్పకుండా మంత్రి అధికారులను నేరుగా కాకినాడ పోర్టు సమీపంలోని బియ్యం గోదాముల వద్ద ఆగారు. దీంతో ఒక్కసారిగా పౌరసరఫరాలశాఖ అధికారులు నివ్వెరపోయారు. వీటిలో ద్వారంపూడి గోదాములు ఉండడంతో ఉలిక్కిపడ్డారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల్లో వైసీపీ కార్యకర్తలు ప్రవేశించి అక్రమాలకు పాల్పడ్డారనీ, వీటిపై విచారణ చేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల కోరారు. వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాలశాఖ పనితీరుపై ఒక్కసారి కూడా మంత్రులు, ప్రభుత్వం సమీక్ష నిర్వహించలేదని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. రేషన్ అక్రమ దందా అడ్డుకున్న వారిపై వైసీపీ ప్రభుత్వం కేసులు పెట్టిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో మంత్రి లేదా కలెక్టర్ ఏ అధికారిక సమీక్ష నిర్వహించినా మీడియాను దూరం పెట్టేవారు. కానీ తొలిసారి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మీడియా సమక్షంలోనే మంత్రి తన సమీక్షను చేపట్టడంతో పాటు అధికారులను కడిగిపారేయడం విశేషం.



1న పిఠాపురం రానున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

- పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా రానున్న జనసేన అధినేత
- పర్యటన ఏర్పాట్లపై కలెక్టరు సమీక్ష
- సభ నిర్వహించే ప్రాంతం పరిశీలన
- పింఛన్ల పంపిణీ ఇక్కడినుంచే ప్రారంభం

పింఛన్‌దారులకు పండుగే

- జూలై నెలలో రూ.4వేలకు పెరగనున్న పింఛను
- సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం గత మూడు నెలలకు రూ.వెయ్యి చొప్పున కలిపి రూ.7వేలు పంపిణీ
- ఇంటింటికీ అందజేయనున్న సచివాలయ సిబ్బంది
- పింఛనుదారుల్లో హర్షం

తుని రూరల్, జూన్ 28: జూలై 1వ తేదీ పింఛన్‌దారులకు పండుగలా మారనుంది. ఆ రోజు పింఛన్‌దారులకు అంతా ప్రత్యేకమే. మొదటిసారిగా పెద్దమొత్తంలో పింఛన్ అందుకోనున్నారు. అదీ కూడా వారి ఇంటివద్దకే సచివాలయ ఉద్యోగులు వెళ్లి పింఛను అందివ్వనున్నారు. కొత్త ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చింది. పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి వద్దకే వెళ్లి ఇచ్చేందుకు ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ మొత్తాన్ని పెంచుతూ పంచాయతీ గ్రామీణ అభివృద్ధిశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పింఛను పెంపు మూడు నెలల కిందటే వర్తింపచేసింది. దీంతో సాధారణ పింఛన్‌దారులు రూ.7వేలు అందుకోనున్నారు. అనంతరం రూ.4వేల చొప్పున ప్రతినెలా పింఛన్ అందుకోనున్నారు. ఒక్కో సచివాలయ ఉద్యోగి 50మందికి పింఛన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం నిర్దేశించింది. ఎన్నికల ప్రచారంలో సామాజిక భద్రత పింఛన్లు రూ.3వేల నుంచి రూ.4వేలు పెంచుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన రోజే సంతకం చేశారు. దీంతో దివ్యాంగులకు పింఛన్ రెట్టింపు చేశారు. దీంతో వారికి రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచారు.

- **జిల్లాలో 2.80లక్షల మందికి లబ్ధి**

తాజా గణాంకాల ప్రకారం జిల్లాలో 2.80లక్షలమంది పింఛన్‌దారులకు లబ్ధి చేకూరనుంది. వీరందరికీ పెంచిన పింఛన్లు జూలైలో అందుకోనున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.1000 చొప్పున పెరిగిన పింఛన్‌తోపాటు జూలైలో రూ.7వేలు అందించనున్నారు. కాగా దివ్యాంగులకు కూడా ఇదే వర్తింపజేస్తే రూ.6వేలు పింఛనుతోపాటు మూడు నెలలకు రూ.3వేలు కలిపి రూ.9వేలు అందనుంది.

- **రూ.200 నుంచి రూ.4వేలకు**

2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.200 ఉన్న సామాజిక పింఛన్‌కు ఒక్కసారిగా 5రెట్లు పెంచి రూ.1000 చేసింది. ఆ తరువాత మరో మూడేళ్లకు పింఛను రెట్టింపు చేస్తూ రూ.2వేలు చేశారు. అంటే చంద్రబాబు 2014లో ముఖ్యమంత్రిగా ఉండగానే రూ.200 ఉన్న పింఛన్ 10రెట్లు పెరిగి రూ.2వేలు అయింది. కాగా 2019 ఎన్నికల్లో తాను పింఛన్ రూ.3వేలు చేస్తామని హామీ ఇచ్చిన మాజీ సీఎం జగన్ దశలవారీగా ఏడాదికి రూ.250 పెంచి ప్రజలను వంచించారు. సరిగ్గా ఎన్నికలకు ముందు రూ.3వేలు ఇచ్చి హామీ నెలబెట్టుకున్నట్లు వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. పింఛన్‌దారులకు అన్నమాట ప్రకారం ఒక్కసారిగా రూ.1000 పెంచి పింఛన్ రూ.3వేల నుంచి రూ.4వేలకు చేసి పింఛన్‌దారులకు కూటమి ప్రభుత్వం మేలు చేసింది.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- మంత్రులను కలిసిన 104 ఉద్యోగుల సంఘం నాయకులు

జీజీహెచ్(కాకినాడ), జూన్ 28: రాష్ట్రంలో 104లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు కోరారు. కాకినాడ జీఆర్‌టీ గ్రాండ్‌లో ఉన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌లను శుక్రవారంరాత్రి ఆయన కలిశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక ఇబ్బందులకు గురయ్యామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ బాధ్యతలు చేపట్టడంతో సమస్యలు పరిష్కారమవుతాయన్న సానుకూల దృక్పథంతో ఉన్నామన్నారు. 104 సిబ్బంది సమస్యలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రులు మనోహర్, దుర్గేష్ హామీఇచ్చారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, త్రిమూర్తులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.65 కోట్లు



హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, జూన్ 28: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో హుండీల ఆదాయం రూ.1.65కోట్లు వచ్చింది. భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,65,05,994 నగదు, 51 గ్రాముల బంగారం, 633 గ్రాముల వెండి లభించాయి. వీటితోపాటు యుఎస్ఏ 286 డాలర్లు, దక్షిణాఫ్రికా 450 రేండ్స్, 528 మలేషియన్ రింగిట్స్, ఇంకా ఇతర దేశాల కరెన్సీని భక్తులు హుండీల్లో వేశారు. 29రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన రోజుకు భక్తులు రూ.5.69లక్షలు కానుకల రూపంలో హుండీలో వేశారు. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు పర్యవేక్షించగా సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ భారం

- ప్రతి కార్డుకు ఈకేవైసీ నమోదుకు రూ.30 చొప్పున వసూలు
- ప్రైవేట్ ఏజెన్సీలకు చెందిన థర్డ్ పార్టీ వ్యక్తుల ద్వారా ప్రక్రియ
- గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఉచితంగా చేయాలంటున్న సివిల్ సప్లయిస్ అధికారులు

సామర్లకోట, జూన్ 28: గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ నమోదుల పేరిట సామర్లకోట మండలంలోను, పట్టణంలోను చేస్తున్న దోపిడీ ఏంటోనని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. గ్యాస్ వినియోగదారులందరూ తన కార్డుకు ఈకేవైసీ నమోదులు చేయాలంటే రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈకేవైసీ నమోదులు అయితేనే ప్రభుత్వం ప్రకటించిన మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా వస్తాయని, లేకుంటే ఉచితం గ్యాస్ అందదని వసూలు చేసే సిబ్బంది చెప్పడంతో పలువురు గ్యాస్ వినియోగదారులు వరుసగా క్యూలు కడుతున్నారు. ఈ వసూళ్లు అటు గ్యాస్ ఏజెన్సీ సంస్థకు చెందిన వారు కాకుండా, అటు గ్యాస్ పంపిణీ ప్రధాన కార్యాలయ అధికారులు కాకుండా ప్రైవేట్ ఏజెన్సీలకు చెందిన థర్డ్ పార్టీకి చెందిన ప్రైవేట్ వ్యక్తులు చేపడుతున్నారు. సామర్లకోట మండలం వేట్లపాలెం తదితర గ్రామాల్లో వారంరోజులుగా చేపడుతున్న ఈకేవైసీ నమోదులు యావత్తూ పంచాయతీ కార్యాలయాల్లో కాకుండా ఆలయాల వద్ద, ప్రైవేట్ భవనాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ వసూళ్లు చేస్తున్నారు. సామర్లకోట మండలంలోను, పట్టణంలోను 30వేలకు పైబడి గ్యాస్ వినియోగదారులు ఉండడంతో జోరుగా వసూళ్లు చేస్తున్నా ఈ వ్యవహారంపై అధికారులు గానీ, గ్యాస్ ఏజెన్సీదారులు గానీ నోరుమెదపకపోవడం వెనుక ఈ వసూళ్ల వ్యవహారం ఆయా గ్యాస్ ఏజెన్సీలకు తెలిసే జరుగుతుందా అనే అనుమానాలు వస్తున్నాయి. ఈకేవైసీ నమోదులు సాధారణంగా గ్యాస్ ఏజెన్సీదారులు తమ గ్యాస్ డెలివరీ బాయిస్ వద్ద ఉండే సెల్‌ఫోన్ల ద్వారా ఉచితంగా చేయాల్సిఉంది. అది ప్రతి గ్యాస్ ఏజెన్సీ దారుడి బాధ్యతగా ఉన్నట్లు సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఈకేవైసీ నమోదులు ప్రైవేట్ సిబ్బంది చేస్తూ వసూళ్లు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందలేదని, గ్రామాల్లో పర్యటించి వాస్తవ సమాచారం సేకరించి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలియజేశారు.

అయిదేళ్లూ అరాచకం

- నేడు కాకినాడ జిల్లా రైసుమిల్లర్లతో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల సమీక్ష
- జిల్లాలో అయిదేళ్లుగా మిల్లుల అక్రమాలపై కన్నెత్తే నాథుడే కరువు
- ధాన్యం కొనుగోళ్లు, రవాణాలో ఎంత అవినీతి జరిగినా మిల్లుల్లో తనిఖీలు నిల్
- రైస్‌మిల్లులన్నీ ద్వారంపూడి కుటుంబం కనుసన్నల్లో ఉండడంతో అధికారుల్లో వణుకు
- ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో మిల్లుల్లో మోసాలపై తనిఖీకి జేసీకి సైతం వణుకు
- అనేక మిల్లుల్లో యథేచ్ఛగా రేషన్‌బియ్యం రీసైక్లింగ్ ● కీలక అధికారులకు లక్షల్లో ముడుపులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో అనేక రైసు మిల్లులు అక్రమాలకు అడ్డాగా మారాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలు, రవాణా సమయంలో రైతులను నిలువునా మోసం చేస్తున్నాయి. పౌరసరఫరాల సంస్థకు ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు(బీజీ) సమర్పించే దగ్గర నుంచి సీఎంఆర్ ధాన్యం స్థానంలో ఒడిషా బియ్యం అంటగట్టినా అడిగే నాథుడే లేరు. కాకినాడజిల్లాలో ఎన్నో ఏళ్లుగా రైసుమిల్లులకు ద్వారంపూడి కుటుంబమే జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతోంది. వైసీపీ పాలనలో జిల్లా, రాష్ట్ర అధ్యక్ష పదవులు ఈ కుటుం బమే అనుభవించింది. అటు ద్వారంపూడి తండ్రి పౌరసరఫరాల సంస చైర్మన్‌గా వ్యవహరించారు. దీంతో జిల్లాలో రైసుమిల్లర్లు అంతా ఈ కుటుంబం కనుసన్నల్లోనే ఉండేవారు. కప్పాలు, అమ్యామ్యాలు వీరు ఎంత అడిగితే అంత సమర్పించాల్సిందే. దీంతో జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు ద్వారంపూడి కుటుంబానికి భయపడి ఏనాడు ఏ మిల్లుపైనా దాడి చేయడానికి సాహసించలేదు. వాస్తవానికి జిల్లాలో సార్టెక్స్, ఫోర్టిఫైడ్ రైసు మిల్లులు 210కిపైనే ఉన్నాయి. వీటిలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఆర్‌బీకేలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తీసుకుని మర ఆడించి ఇవ్వాలి. కానీ అదే సమయంలో పలు మిల్లులు ఒడిషా నుంచి కారుచౌకగా ధాన్యం కొనుగోలుచేసి మర ఆడించి తీసుకున్న ధాన్యం రకం బదులు ఒడిషా ధాన్యం మర ఆడించి అంటగడుతున్నాయి. ఇలా మిగుల్చుకున్న జిల్లాలో పండిన బియ్యాన్ని పాలిష్‌చేసి విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లలో సంపాదిస్తున్నాయి.

తనిఖీల ఊసే లేదు..

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో రైసుమిల్లుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఎంత ధాన్యం వెళ్లిందో అంతే నిల్వ ఉండాలి. కానీ దీనికి సమానంగా ఒడిషా ధాన్యం ఉంటున్నాయి. వీటిని తనిఖీచేసి స్వాధీనం చేసుకుని మిల్లులపై కేసులు నమోదు చేయాలి. కానీ ద్వారంపూడి కుటుంబానికి భయపడి జిల్లా పౌరస రఫరాల సంస్థ డీఎం నుంచి జాయింట్ కలెక్టర్ వరకు మిల్లులవైపు కన్నెత్తి చూడ్డానికి కూడా గత అయిదేళ్లలో సాహ సించలేదు. కానీ ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో మిల్లర్ల నుంచి జిల్లావ్యాప్తంగా కోట్లలో ముడుపులు వసూలుచేసి ఆయా కీలక అధికారులకు చదివించడం మామూలుగా వస్తోంది. దీంతో జిల్లాలో మిల్లులపై దాడులు అనే సంగతే అంతా మర్చిపోయారు. రేషన్ బియ్యం కాకినాడజిల్లాలో ద్వారంపూడితోపాటు ఆయన కుటుంబం ఆశీస్సులు ఉన్న పలు మిల్లుల్లో యథేచ్ఛగా రీ సైక్లింగ్ జరిగిపోతోంది. కానీ ఏనాడు అధికారులు ఏ మిల్లు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అనేక మిల్లుల్లో రేషన్ దందా, ధాన్యం దందా యథేచ్ఛగా జరుగుతోంది. కొన్ని మిల్లులు నిబంధ నలు, మోసాలకు పాల్పడే మిల్లులను సీజ్ చేసేలా ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. జిల్లాలో మిల్లులపై ద్వారంపూడి కుటుంబం పెత్తనం ఉన్నంతకాలం రేషన్ బియ్యం మాఫియా, ధాన్యం కొనుగోలులో మిల్లుల మతలబులు ఆగే పరిస్థితిలేదని అధికారులే చెబుతున్నారు. మరోపక్క గడచిన ఐదేళ్లలో పౌరసరఫరాల సంస్థ డీఎం, జేసీ, ఇతర రెవెన్యూ అధికారులు ఎన్ని మిల్లుల్లో తనిఖీలు చేశారనేది నిలదీస్తే బండారం అంతా బయటపడ నుంది. జిల్లాలో మిల్లర్లకు రావాల్సిన బకాయిల్లోను ద్వారంపూడి కుటుంబం కమీషన్లు భారీగా కొట్టేసింది. బిల్లులు ఇప్పించే పేరుతో పర్సంటేజీలు బాదేసి కోట్లలో ఆర్జించిందని మిల్లర్లే లబోదిబోమంటున్నారు.

ప్రకారం వ్యవహ రించినా ద్వారంపూడి కుటుంబాన్నికాదని మిల్లులు నడిపించే పరిస్థితిలేదు. గట్టిగా ప్రశ్నిస్తే అధికారుల ద్వారా దాడులు, లేదా ధాన్యం సేకరణనుంచి తప్పించడం చేస్తారనే భయం భయంతో నడుస్తున్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేప థ్యంలో పౌరసరఫరాలశాఖ మంత్రిగా నాదెండ్ల శనివారం కలెక్టరేట్‌లో మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో మిల్లర్ల అక్రమాలపై గట్టిగా ప్రశ్నించడంతోపాటు నిబంధ


నడకుదురులోని గోదామును తనిఖీచేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నడకుదురులో గోదాముల తనిఖీ

- మంత్రి ఆదేశాలతో రూ.13.50కోట్ల సరుకు సీజ్

కరప, జూన్ 28: రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం సాయంత్రం కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులోని లావన్ ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన గోదాములను తనిఖీచేశారు. గోదాములలోని పీడీఎస్ రైస్‌ను పాలిస్ పట్టించినట్టుగా గుర్తించిన మంత్రి రికార్డులను తనిఖీచేశారు. గోదాములోని నిల్వలకు, రికార్డులకు పొంతన లేకపోవడంతో బాటు పలు అవకతవకలను పసిగట్టిన మంత్రి గోదాములను సీజ్‌చేసి మొత్తం వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు రెండు గోదాములలో ఉన్న, బయట లారీల్లో ఎక్కించిన బియ్యం, నూక, ఇతర సరుకులను లెక్కించారు. చివరకు రూ.13కోట్ల40లక్షల59వేల570ల విలువ కలిగిన 4,531.14 టన్నుల సరుకును సీజ్‌చేశారు. అలాగే ఉప్పలంకలోని సరళ ఫుడ్స్ రైస్‌మిల్లును మంత్రి తనిఖీచేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దాన్ని కూడా సీజ్‌చేయాలని ఆదేశించారు. ఈ రైస్‌మిల్లులోని వివిధ రూపాల్లో ఉన్న సరుకును కూడా అధికారులు లెక్కిస్తున్నారు. తహశీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఆర్ఐ మాచరరావు, వీఆర్వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

1న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూన్ 28: వికాస ఆధ్వర్యంలో జూలై 1న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో భవి క్రియేషన్స్ కంపెనీలో సోషల్ మీడియా మేనేజర్, కాశీస్వరి రిఫైనరీ ఇండస్ట్రీస్‌లో టెక్నీషియన్, శ్రీగోపాల్ ఆటోమోటివ్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటెటివ్, అసిస్టెంట్ మేనేజర్, బాలాజీ కెపిటల్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజర్, టెలీకాలర్స్, డేటా సోర్సింగ్ ఆఫీసర్, యాక్సెస్ బ్యాంకులో బిజినెస్ డెవలప్‌మంట్ ఎగ్జిక్యూటివ్, డెక్కన్‌కెమికల్స్ ట్రైనీ ప్రొడక్షన్, కో-జెంట్ ఈ సర్వీసెస్ కంపెనీలో బీపీవో, రాక్‌మెన్ ఇండస్ట్రీస్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 77993 76111లో సంప్రదించాలన్నారు.

పీఏసీఎస్‌లకు సహకార శాఖాధికారులు పీఐసీలుగా నియామకం

కాకినాడరూరల్, జూన్ 28: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా డీసీసీబీ పరిధిలోని సహకార సంఘాల సొసైటీలకు గతంలో నియమించిన కమిటీలు రద్దయ్యాయి. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో సంబంధిత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేవరకూ వాటి పాలనా బాధ్యతలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో గల 298 పీఏసీఎస్‌లకు సహకార శాఖాధికారులను పీఐసీ(పర్సన్ ఇన్‌ఛార్జి)లుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వారి పదవీకాలం లేదా పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించేవరకూ పీఐసీలను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పీఐసీలను నియమిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.దీంతో సహకారరంగంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించినట్లయింది.


పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో డిప్యూటీ సీఎం పవన్ నిర్వహించే సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు సగిలి షాన్ మోహన్

పవన్ పర్యటన
ఏర్పాట్లపై కలెక్టరు సమీక్ష

- సభ నిర్వహించే ప్రాంతం పరిశీలన

పిఠాపురం, జూన్ 28: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ సమీక్ష నిర్వహించారు. పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం వచ్చేనెల 1న తొలిసారి నియోజకవర్గానికి రానున్నారు. ఈ సందర్భంగా ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి సభలో పవన్ పాల్గొననున్నారు. పవన్ సభ నిర్వహించే ప్రాంతాన్ని కలెక్టరు పరిశీలించారు. వారాహి సభకు సంబంధించిన వివరాలపై అధికారులను ఆరా తీశారు. సభకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లుపై కలెక్టరు పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో విజయం అనంతరం పవన్ నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ కావడంతో భారీఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జడ్పీ సీఈవో రామచంద్రమూర్తి, పిఠాపురం తహసీల్దారు లక్ష్మీ, మునిసిపల్ కమిషనరు కనకారావు, సీఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ ఇక్కడి నుంచే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాలను రూ.4వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచి పెంపును అమలు చేస్తున్న నేపథ్యంలో ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.7వేలు అందించే కార్యక్రమానికి పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో వారాహి సభను 2వ తేదీన నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.

చేపలతో నిరసన

మార్కెట్లో సమస్యల పరిష్కారం కోరుతూ మహిళల ఆందోళన

యానాం, జూన్ 28: చేపలను విక్రయించే మహిళలు మార్కెట్లో సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పరిపాలనాధికారి కార్యాలయం ఎదురుగా చేపల బుట్టలు పెట్టి సమస్యలను పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనరు ఖండవల్లి రామకృష్ణ, ఎస్ఐ మురుగనందం వచ్చి మహిళలతో మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారు అధికారులకు వివరించారు. ముఖ్యంగా రబ్బరుమ్యాట్‌లు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నిత్యం ఎవరో ఒకరు గాయాలపాలవుతున్నారన్నారు. రాత్రి సమయంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలన్నారు. మార్కెట్లో దాచుకున్న చేపలను అపహరించుకుపోతున్నారన్నారు. సాయంత్రం పలువురు మద్యం సేవించి వికృత చేష్టలు చేస్తున్నారన్నారు. మార్కెట్ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. కుళాయిలు, ఫ్యాన్లు వేయాలని, చేపలు శుభ్రం చేస్తున్న వారికి షెడ్డు నిర్మించాలని కోరారు. యానాం మార్కెట్లోని చేపలు మాత్రమే విక్రయించాలని, బయటి ప్రాంతాల చేపలు విక్రయించకుండా చూడాలన్నారు. సమస్యలను వారంలో పరిష్కరి స్తామని కమిషనరు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.అధికారులు మార్కెట్‌ను పరిశీలిస్తున్న సమయంలోనే రత్నం అనే మహిళ జారిపడింది. గాయాలపాలైన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


చేపలతో ఆందోళన చేస్తున్న మహిళలు, వారితో మాట్లాడుతున్న కమిషనర్ రామకృష్ణ, పోలీసులు


వంతెన నిర్మాణాన్ని మ్యాప్ ద్వారా వివరిస్తున్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు

బిల్లుల మంజూరులో జాప్యం

- ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడి, ఉడిమూడి పంచాయతీ పరిధిలో వంతెన నిర్మాణానికి సం బంధించిన బిల్లుల మంజూరులో జాప్యాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.12 కోట్లు మంజూరయ్యేలా కృషిచేస్తానని చెప్పా రు. రూ.49.50కోట్లతో నిర్మిస్తున్న వంతెన డిజైన్ మ్యాప్‌ను శుక్రవారం ఆయన జనసేన క్యాంపు కార్యాలయంలో అధికారుల సమక్షంలో పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మా ట్లాడుతూ లంక గ్రామాలకు వంతెన నిర్మాణం దశాబ్దాల కలగా మిగిలిపో యిందన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు సూచించారు. వంతెన నిర్మాణంలో ఇప్పటివరకు దాదాపు మూడు పిల్లర్లు, రెండు వెల్స్ పూర్తయ్యాయని ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు ఎమ్మెల్యేకు వివరించారు. లంక గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా న్నారు. ఏఈఈ దుర్గా కొండలరావు, ఏఈ గంగాధర్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వ రావు, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్య కాపు, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలను ఢీకొట్టిన లారీ

- భర్త అక్కడికక్కడే మృతి
- భార్యకు తీవ్ర గాయాలు..
- ఆసుపత్రికి తరలింపు.. పరిస్థితి విషమం


వానపల్లి ప్రధాన రహదారి మలుపులో భార్యాభర్తలను ఢీకొట్టిన లారీ, ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీనివాసపల్లంరాజు (ఫైల్)

కొత్తపేట, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి ప్రధాన రహదారి మలుపులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతిచెందగా భార్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... వానపల్లి సంగం పాలేనికి చెందిన యిళ్ల శ్రీనివాసపల్లంరాజు (49) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇతనికి శుక్రవారం మధ్యాహ్నం పొలంలో విషపు పురుగు కుట్టినట్టు అనుమానం రావడంతో స్నేక్ వీనమ్ వ్యాక్సిన్ కోసం భార్య నారాయణమ్మతో కలిసి వానపల్లి పీహెచ్‌సీకి బయల్దేరాడు. వ్యాక్సిన్ అందుబాటులో లేదని, కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో ఉందని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో దంపతు లిద్దరూ మోటారు సైకిల్‌పై కొత్తపేట ప్రభుత్వాసుత్రికి వెళ్లి వ్యాక్సిన్ చేయించుకుని ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో వానపల్లి మలుపువద్ద కాట్రేనికోన నుంచి ధాన్యం లోడుతో ద్వారపూడి వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. శ్రీనివాసపల్లంరాజు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు, తలకు తీవ్ర గాయాలైన నారాయణమ్మను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడికి వరుసకు తమ్ముడైన యిళ్ల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు

- కాకినాడ టౌన్ బ్యాంక్ చైర్మన్ రవీంద్ర

కాకినాడ సిటీ, జూన్ 28: ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందజేస్తామని ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర అన్నారు. కాకినాడ రాజాట్యాంక్ ఆవరణలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో బ్యాంకు 45వ వార్షిక మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ సభ్యులకు 15శాతం డివిడెండు చెల్లించనున్నట్లు వెల్లడించారు. రూ.1753కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో టౌన్ బ్యాంక్ 2వ స్థానంలో ఉందన్నారు. ఈఏడాది మార్చి 31నాటికి డిపాజిట్లు రూ.1,056.73కోట్లు, లోన్లు రూ.696.47 కోట్లు, ఇన్‌వెస్ట్‌మెంట్లు రూ.447.35కోట్లు, బ్యాంకు సొంత నిధులు రూ.172.13కోట్లు ఉన్నాయన్నారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో సి.సుగుణారావు ప్రవేశపెట్టిన వివిధ అజెండా అంశాలను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో బ్యాంక్ ఉపాధ్యక్షుడు తోట సుధీర్, డైరెక్టర్లు కంటిపూడి సత్యనారాయణ, జీఏ కళ్యాణ్ ప్రసాద్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ టౌన్ బ్యాంక్ చైర్మన్ రవీంద్ర

శ్రీరామగిరి ఆలయంలో వాహన విగ్రహాలు చోరీ


ఆలయంలో విచారణచేపడుతున్న ఎస్ఐ నాగరాజు
అపహరణకు గురైన వాహన విగ్రహాలు (ఫైల్)

వరరామచంద్రాపురం, జూన్ 28: మండలంలోని రెండవ భద్రగిరిగా పేరుగాంచిన శ్రీరామగిరి ఆలయంలోని వాహన విగ్రహాలు (ఇత్తడి) గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఆలయంలో పనిచేస్తున్న స్వీపర్ ఉదయాన్నే ఆలయానికి వెళ్లగా వాహన విగ్రహాలు లేకపోవడంతో అతను గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు వెళ్లి చూడగా విగ్రహాలు అపహరణకు గురయ్యాయని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచాలం ఇచ్చారు. దీంతో ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో శ్రీరామగిరి ఆలయానికి చేరుకొని గ్రామస్తులను, ఆలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీకి గురైన ప్రదేశాన్ని క్షుణంగా పరిశీలించారు. అపహరణకు గురైన విగ్రహాలు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన అ త్యంత పురాతనమైన గరుడ, అశ్వం ఆంజనేయస్వామి వాహన విగ్రహాలు. అవి ఇత్తడి, లోహంతో తయారుచేసిన విగ్రహాలు అని గ్రామస్తులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐతోపాటు ఆలయ చైర్మన్ రేవు బాల రాజు, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి, టీడీపీ నాయకులు ముత్యాల రామారావు, ఆచంటి శ్రీను, బొర్రా నరసింహారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకిన మహిళ సురక్షితం

- సమయానికి స్పందించిన పోలీసులు


గోదావరిలో మహిళను రక్షిస్తున్న జాలర్లు



రాజమహేంద్రవరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం 5గంటల సమయం.. ఓ మహిళ ప్రాణాలు తీసుకో వడానికి గోదావరిలో దూకింది.. అది చూసి అటుగా వెళ్తున ఓ వ్యక్తి పోలీ సులకు ఫోన్ చేశారు.. వెంటనే పోలీసులు స్పందించారు.. జాలరుల సహాయంతో బోటులో వెళ్లి ఆమెను రక్షించారు. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని మల్లికార్జున నగర్‌కి చెందిన దూడల నాగలక్ష్మికి తన భర్తతో డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆమె రోడ్‌కం రైలువంతెనపైకి చేరుకొని గోదావరిలో దూకేశ్లింది. అటుగా వెళ్తున్న వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే ఎస్ఐ రత్తయ్య, కానిస్టేబుల్ లీలాకుమార్ అప్రమత్త మయ్యారు. అక్కడికి దగ్గరి రేవులోని జాలరులకు సమాచారం ఇస్తూనే ఘటనా ప్రదే శానికి బయలుదేరారు. నీటిపై తేలుతున్న ఆ మహిళ వద్దకు బోటులో జాలరులతో వెళ్లి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. నాగలక్ష్మికి కౌన్సెలింగ్ ఇచ్చి సంబంధీకులకు అప్పగించామని సీఐ తెలిపారు. విధుల్లో ప్రతిభ చూపిన ఎస్ఐ, కానిస్టేబుల్‌ని ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

- ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఉమామహేశ్వరరావు, గాయపడ్డ ప్రకాష్

అమలాపురంరూరల్, జూన్ 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఈదరపల్లి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గుడాల ఉమామహేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు సూచించారు. సబ్‌స్టేషన్‌లో అవుట్ సోర్సింగ్ విభాగంలో షిఫ్ట్ ఆపరేటర్, అసిస్టెంట్లయిన ఉమామహేశ్వరరావు, వి.ప్రకాష్ అంబాజీపేట ఫీడర్ ట్రిప్ కావడంతో ఎల్‌సీ ఇచ్చి పనులు చేపట్టారు. అదే సమయంలో ఉప్పలగుప్తం ఫీడర్ కూడా ఎల్‌సీ కోరారు. ఆ సమయంలో ఎర్త్ రాడ్స్ మెయిన్‌లైన్‌కు తగలడంతో ఒక్కసారిగా మంటలు ఎగసి పెద్ద శబ్దంతో పేలింది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, ప్రకాష్ స్వల్పంగా గాయపడ్డాడు. వారిద్దరినీ చికిత్స నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనా ప్రాంతాన్ని ట్రాన్స్‌కో డీఈ హేమలత, ఏడీఈ భగవాన్ పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టి గాయపడ్డ వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మధ్యప్రదేశ్ నుంచి గోధుమలు దిగుమతి

సామర్లకోట, జూన్ 28: సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు మధ్యప్రదేశ్ నుంచి శుక్రవారం 1,800మెట్రిక్ టన్నుల గోధుమలు దిగుమతులు అయ్యాయి. మధ్యప్రదేశ్ నుంచి గోధుమలు రవాణాకు వినియోగించిన గూడ్స్‌రైలు సామర్లకోటకు చేరుకుంది. సామర్లకోట ఏడీబీ రోడ్డులో లలితా ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ ఈ గోధుమలను దిగుమతులు చేసుకుంది. రైల్వేకు రవాణా చార్జీలుగా రూ.35లక్షల మేర చెల్లించినట్లు సమాచారం. గోధుమలు సామర్లకోటలో దిగుమతులు, తిరిగి లారీల ద్వారా ఎగుమతులుకు చెందిన సుమారు 100 లారీలకు రవాణా చార్జీలుగానూ, దిగుమతులు, ఎగుమతులు ద్వారా హమాలీలు సుమారు 150మందికి ఉపాధి లభించినట్లైంది. సామర్లకోట పరిసరాలలో పరిశ్రమలకు మరో 30వేల మెట్రిక్ టన్నుల మేర గోధుమలు దిగుమతులు కాగలవని రైల్వే అధికారులు చెప్పారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 28: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కె.సుధారాణి రూ.1,00,400 విరాళంగా సమర్పించారు. ఈమొత్తాన్ని దాత ఏపీఆర్వో గణపతికి అంద జేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

సీలేరు నదిలో బాలుడు గల్లంతు


సీలేరు నదిలో గల్లంతైన బాలుడు (ఫైల్)

చింతూరు, జూన్ 28: ప్రమాదవశాత్తు ఒక బాలుడు సీలేరునదిలో పడి గల్లంతయ్యాడు. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని కొత్తపల్లిలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా మడతల్ గ్రామానికి చెందిన సోయం ముఖేష్ తన కుమారుడు సింకుని వెంట బెట్టుకొని చింతూరు మండలం, కొత్తపల్లిలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చాడు. కాగా కొత్తపల్లి సీలేరు నదిని ఆనుకొని ఉండడంతో నది వద్దకు కొంతమందితో కలసి వెళ్లిన సింకు(7) ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. దీంతో నది ప్రవాహంలో సింకు కొట్టుకుపోయాడు. సింకుకోసం గ్రామస్థులు గాలించినప్పటికీ ఆచూకీ కానరాలేదు.

అట్టహాసంగా అన్నవరం దేవస్థానం
వ్రతపురోహిత యూనియన్ ప్రమాణస్వీకారం

అన్నవరం, జూన్ 28: ఇటీవల ఎన్నికైన అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత యూనియన్ అధ్యక్షుడు చామర్తి కన్నబాబు, కార్యదర్శి సవితాల వీరబాబు, కోశాధికారి మెకరాల రాజేష్‌లు శుక్రవారం సాయంత్రం యూనియన్ సభ్యుల సమక్షంలో ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షుడు కన్నబాబు మాట్లాడుతూ అన్నవరం దేవస్థానం వ్రతపురోహితుల ద్వారా దేవస్థానం ఖ్యాతిని మరింత ఇనుమడింపచేసి సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో వ్రతపురోహిత సూపర్‌వైజర్లు, సభ్యులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న వ్రతపురోహిత యూనియన్ నాయకులు

పొగాకు అ'ధర'హో..

- సిరులు కురిపిస్తున్న పొగాకు సాగు ● వర్జీనియాకు 50 ఏళ్లలో అత్యధిక ధర


గోపాలపురం వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకుబేళ్లు

గోపాలపురం, జూన్28: ఏజెన్సీ మెట్టప్రాంత రైతాంగానికి పొగాకు సాగు సిరులు కురిపిస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో తేలికనేలల్లో పండే వర్జీనియ పొగాకుపంట లేకపోతే రైతులతో పాటు రైతుకూలీలకు ఒకప్పుడు పని ఉండేది కాదు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు గత 50ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర పలుకుతుంది. ఈ ప్రాంతంలో పండేపంట దేశంలోనే నాణ్యమైనది కావడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ రాష్ట్రంలో పండే పొగాకు పంటకు ధరలో వ్యత్యాసం పలుకుతోంది. గతంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన పొగాకు రైతాంగం అప్పులు తీరగా రెండో ఏడాది పంట వేయకతప్పదం లేదనే భావనలో ఉన్నారు. రెండేళ్ల నుంచి పొగాకు సాగు ప్రా రంభం నుంచి ఎన్నడు లేని దరలు కిలో పొగాకు ధర రూ.368 పలికింది. దీంతో తమ కష్టానికి తగిన ఫలితం చూస్తున్నామనే భావనతో పొగాకు రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర రావడంతో రైతులు, రైతుకూలీలు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

ధరకు తగ్గ దిగుబడి లేదు

- ముళ్ళపూడి శివాజీ, పొగాకు రైతు, చెరుకుమిల్లి

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో పెట్టుబడికి తగిన దిగుబడి రాలేదు. అయితే పొగాకు సాగు చేసే రైతులకు పెట్టుబడుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

ధరల పెంపుతో ఊరట

- కొడవటి చినవెంకటేశ్వరరావు, పొగాకు రైతు, గోపాలపురం.

పొగాకు సాగు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు చరిత్రలో ఎన్నడు లేని విధంగా సన్న, చిన్నకారు రైతులు పొగాకు ధరతో ఊపిరి పీల్చుకున్నారు. నష్టాల బారిన పడి ఆత్మహత్యలు చేసుకుందామనే స్థితి నుంచి కుటుంబ సమేతంగా గుప్పెడు మెతుకులు తింటున్నామన్న భావం వచ్చింది. పొగాకు ధరలు పెరగడం చిన్న, సన్నకారు రైతులకు ఊరటనిచ్చినట్లయ్యింది.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేడు పురాతన కెమెరాల ప్రదర్శన

కాకినాడ సిటీ, జూన్ 28: జాతీయ కెమెరా దినోత్సవం పురస్కరించుకుని కాకినాడ మెయిన్‌రోడ్‌లోని టౌన్ హాల్‌లో శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పురాతన కెమెరాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు కాకినాడ కెమెరా క్లబ్ (ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అనుబంధ సంస్థ) కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తెలిపారు. నగర ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి'

కాకినాడ సిటీ, జూన్ 28: గతేడాది 2023, అక్టోబరులో జరిగిన మానిటరింగ్ కమిటీ సమావేశం తర్వాత ఇంతవరకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరగలేదని.. ఎస్సీ, ఎస్టీల సమస్యలపై చర్చించడానికి కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డోకుబుర్ర భద్రం మాస్టారు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం నూతన కలెక్టర్ సగిలి షాన్ మోహన్‌ను కమిటీ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రయత్నం చేద్దామన్నారు. జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ ఎం.పవన్‌కుమార్, బండీ వీరలింగేశ్వరరావు, త్రినాథ్ దేవ్, పిల్లి జ్యోతి, డివిజన్ కమిటీ సభ్యుడు సాపే సుధాకర్, దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక సభ్యులు నందిక వీరబాబు, షేక్ ఇస్మాయిల్, కార్పొరేషన్ హెల్త్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి'

సామర్లకోట, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంఈవో శివరామకృష్ణయ్య కొత్తూరు నెంబరు-1 మున్సిపల్ పాఠశాల పరిసరాలు పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలు తీరులో రుచి, శుచి, నాణ్యతాప్రమాణాలు వంటి అంశాలను పరిశీలించారు. పట్టణంలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నతపాఠశాలను ఎంఈవో-2 పుల్లయ్య తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్‌బుక్స్, వర్క్‌బుక్‌లను పరిశీలించారు. పాఠశాలలో 482 మంది విద్యార్థులు భోజనాన్ని స్వీకరించడం పట్ల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

'విద్యార్థుల నమోదును పెంచాలి'

ప్రత్తిపాడు, జూన్ 28: ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదును పెంచాలని ఎంఈవో డి.రాజబాబు కోరారు. మండలంలోని తోటపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలకు చెందిన 34 రకాల రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థుల నమోదు, విద్యా ప్రగతిపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు జంధ్యం అప్పలరాజు, ప్రధానోపాధ్యాయురాలు వై.సత్యవతి, పీఆర్ఎంపీ రాంజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సకాలంలో రేషన్ సరుకులు అందించాలి'

కరప, జూన్ 28: వినియోగదారులందరికీ సకాలంలో రేషన్ సరుకులు అందించాలని తహశీల్దార్ వి.రామకోటేశ్వరరావు సూచించారు. కరప తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్లతో ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. జూలైలో కూడా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ జరిగే అవకాశముందని, డీలర్లు అందుకనుగుణంగా వ్యవహరించి సక్రమంగా సరుకులు అందేలా చూడాలన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మండల పర్యటనకు వచ్చే అవకాశముందని, డీలర్లందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఆర్ఐ పేపకాయల మాచరరావు, డీలర్ల సంఘం ప్రతినిధులు నల్లా వెంకటేశ్వరరావు, నక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయాలి'

కరప, జూన్ 28: జూలై 1న ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమై పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేయించాలన్నారు. 1న ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించి సాయంత్రానికల్లా పూర్తిచేయాలన్నారు. ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, ఏవో గుత్తుల భీమశంకరరావు తదితరులున్నారు.

'స్కీం వర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలి'

ప్రత్తిపాడు, జూన్ 28: స్కీం వర్కర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని నియోజకవర్గ సీఐటీయూ అనుబంధ స్కీం వర్కర్ల సంఘ నాయకులు స్థానిక తోటవీధిలో శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు మంజూరు చేయాలని, భవన నిర్మాణకార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని... ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు, మెట్ల శ్రీను, స్కీం వర్కర్ల సంఘాల నాయకులు, లక్ష్మి, హేమలత, వరలక్ష్మి, పి.రమణ, సాల్మన్‌రాజు, మంగాలక్ష్మి, సునీత, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం ఎన్నిక

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 28: ఏపీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గం సభ్యులను గుంటూరులో నిర్వహించిన రాష్ట్రమహాసభలో ఎన్నుకున్నారు. కాకినాడ జీజీహెచ్‌కు చెందిన బుడ్డిగ స్వామిబాబును ఆ కమిటీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కట్టిమేను మోహనరావు, వట్టిప్రోలు ప్రసన్‌కుమార్‌లు ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్వామిబాబు తెలిపారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 'నున్న'

సామర్లకోట, జూన్ 28: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సామర్లకోట మండలం వేట్లపాలెం ఆదిలక్ష్మి ఇండస్ట్రీస్ భాగస్వామి, యువ పారిశ్రామిక వేత్త నున్న రామకృష్ణ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. జిల్లా రైస్‌మిల్లర్స్ సర్వసభ్య సమావేశం కాకినాడలో శుక్రవారం నిర్వహించగా జిల్లాలోని అందరు రైస్‌మిల్లర్లు హాజరుకాగా నున్న రామకృష్ణ ఒక్కపేరు మాత్రమే ప్రతిపాదనలోకి రాగా పోటీలో ఇంకెవరూ లేకపోవడంతో రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామకృష్ణ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను కలిసి పుష్పగుచ్ఛం అందజేయగా రాజప్ప అభినందించారు. పారిశ్రామికవేత్తలు మట్టే శ్రీనివాస్, వల్లూరి సూరిబాబు, నిమ్మకాయల రంగనాగ్, గుమ్మళ్ళ రామకృష్ణ, కొండపల్లి కృష్ణమూర్తి, తోటకూర శ్రీనివాస్ రామకృష్ణను అభినందించారు.

బాధిత కుటుంబానికి జనసేన ఆర్థికసాయం

పిఠాపురం రూరల్, జూన్ 28: పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన జనసైనికుడు కేశవరపు శేఖర్ ప్రమాదంలో మరణించాడు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు అతడి కుటుంబాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పరామర్శించారు. జనసేన పార్టీ తరఫున రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని, బి.ప్రత్తిపాడు జనసైనికులు సమకూర్చిన రూ.65వేలు వెరసి రూ.1.15లక్షలను శేఖర్ కుటుంబానికి అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, జూన్ 28: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విజిలెన్స్ ఎస్పీ పూజలు

సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా వారికి పీఆర్వో స్వామివారి ప్రసాదం అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎంఎస్‌వో మమత

సర్పవరం జంక్షన్, జూన్ 28: కాకినాడ రూరల్ సర్పవరంలో అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 858 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎంఎస్‌వో మమత తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ చేశారన్న సమాచారం మేరకు దాడి చేయగా పెద్దాపురం మండలం గోరింటకు చెందిన పి.సతీష్ పీడీఎస్ బియ్యాన్ని ఓ ఇంట్లో నిల్వ ఉంచడాన్ని గుర్తించి సీజ్ చేశామన్నారు. ఈ బియ్యం స్టాకును కాకినాడ ఎంఎల్ఎస్ పాయింట్‌కి తరలించి, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా పరిషత్ సీఈవో రామచంద్రమూర్తి

పిఠాపురం, జూన్ 28: గ్రామాలు, పట్టణాల్లో డయేరియా ప్రబలకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో రామచంద్రమూర్తి సూచించారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ సహా వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలు బావుల్లో నీటిని వినియోగిస్తున్నట్లయితే వాటిని పరీక్షించాలని సూచించారు. ఇటీవల జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి గొల్లప్రోలులో పర్యటించినప్పుడు ట్యాంకర్ల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్టు గుర్తించారని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూలై 1వ నుంచి పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్నందున అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో డీపీవో సౌజన్య, డిప్యూటీ సీఈవో రాంగోపాల్, అధికారులు పాల్గొన్నారు.


పిఠాపురంలో అధికారులతో మాట్లాడుతున్న సీఈవో

కొత్తపల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్తు సీఈవో శ్రీరామచంద్రమూర్తి ఆదేశించారు. డిప్యూటీ సీఎం పవన్ జూలై 1న పిఠాపురం నియోజకవర్గానికి రానున్న తరుణంలో శుక్రవారం కొత్తపల్లి మండలం వాకతిప్పలో సూరప్పచెరువులో నాగులాపల్లి సమగ్ర ఏరియా రక్షిత మంచినీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి పరిశీలించారు. ఎంపీడీవో పి.వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఏఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే కొనసాగించాలి

తొండంగి, జూన్ 28: డయేరియా రోగులను గుర్తించేందుకు చేపట్టిన ఇంటింటి సర్వేను మరి కొంతకాలం కొనసాగించాలని డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటించారు. గతంలో మూసివేసి ఇటీవల విడుదల చేసిన తాగునీటి శాంపిళ్లను సేకరించారు. ఆయన మాట్లాడుతూ రోజూ ఉదయం, సాయంత్రం ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఎవరైనా డయేరియా లక్షణాలతో ఉంటే వెంటనే శిబిరానికి తరలించి తక్షణం వైద్య సహాయం అందించాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో సరిత, వైద్యులు రవికుమార్, అర్చన పాల్గొన్నారు.


తొండంగి : బెండపూడిలో పర్యటిస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో

డయేరియా తీవ్రత కిడ్నీలపై ప్రభావం

ప్రత్తిపాడు, జూన్ 28: డయేరియా తీవ్రత కిడ్నీలపై ప్రభావం చూపడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని ప్రత్తిపాడు ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య చెప్పారు. ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి వచ్చిన డయేరియా వ్యాధి గ్రస్తులకు ఆమె వైద్యసేవలు అందించారు. అనంతరం మాట్లాడారు. విరోచనాలు,వాంతులు లక్షణాల వల్ల ముందస్తుగా హైడ్రేషన్ మందులు రోగికి అందించడం ద్వారా ప్రమాదంలోకి వెళ్లకుండా నివారించవచ్చన్నారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలేందుకు కారణమయ్యే నీటి నిల్వలు లేకుండా గ్రామ పంచాయతీలు చర్యలు చేపట్టాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత కోరారు. ప్రత్తిపాడులోని నీటినిల్వ ప్రదేశాలు వాటర్ ట్యాంకులు,మురికినీటి డ్రైన్లను ఆమె పరిశీలించారు. ఎంపీడీవో డేవిడ్‌రాజుతో సమావేశమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

డయేరియాపై అవగాహన

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 28: కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ పరిధిలో డయేరియాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కొత్త కాకినాడ సెక్టార్ సూపర్‌వైజర్ దయామణి, రేచర్లపేట సెక్టార్ సూపర్‌వైజర్ కేఎస్ అరుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు కాకినాడ అర్బన్ సీడీపీవో ఎ.జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరిసరాల పరిశుభ్రత అవగాహన, అనంతరం ర్యాలీ చేపట్టారు.

ప్రత్తిపాడు అభివృద్ధికి సహకరించండి

ప్రత్తిపాడు, జూన్ 28: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ సగిలి షాన్ మోహన్‌ను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. శుక్రవారం కాకినాడ విచ్చేసిన మంత్రి మనోహర్‌ను కలెక్టరేట్‌లో, కలెక్టర్‌ను ఆమె వేర్వేరుగా కలిసి బొకే, మొక్కలు అందజేశారు. మంత్రి, కలెక్టర్‌ను నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు.


మంత్రి నాదెండ్లకు బొకే అందజేస్తున్న సత్యప్రభ

ఎమ్మెల్యే చిత్రపటం అందజేత

రౌతులపూడి, జూన్ 28: ప్రత్తిపాడు టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు, ఎ.మల్లవరం టీడీపీ యువనేత గవిరెడ్డి గురునాథ్ ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్యప్రభ, రాజా దంపతులు చిత్రపటాన్ని సత్యప్రభకు అందజేశారు. పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

స్పీకర్‌ను కలిసిన వర్మ

పిఠాపురం, జూన్ 28: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని అమరావతిలో పిఠాపురం మాజీ ఎమ్మె ల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన అభినందనలు తెలియజేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక పల్లా శ్రీనివాస్ పదవీబాధ్యతల స్వీకరణలో మంత్రి నారా లోకేశ్‌తో పాటు వర్మ పా ల్గొని శ్రీనివాస్‌కు అభినందనలు తెలియజేశారు. వర్మతో టీడీ పీ పిఠాపురం మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు నల్లా శ్రీనివాస్ ఉన్నారు.


స్పీకర్‌కు బొకే అందజేస్తున్న వర్మ

మంత్రి, స్పీకర్‌ను కలిసిన నులుకుర్తి

కాకినాడ రూరల్, జూన్ 28: మంత్రి నారా లోకేశ్, స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, హోం మంత్రి వంగలపూడి అనితను కాకినాడ రూరల్ ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు శుక్రవారం వారి ఛాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సత్తిబాబు, గోవిందరావు, దీపు ఉన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సత్కారం

కిర్లంపూడి, జూన్ 28: టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబును శుక్రవారం అంగన్‌వాడీలు పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. కూటమి ఘన విజయం సాధించడంతో కిర్లంపూడిలో మెజార్టీ రావడానికి కృషి చేశారని అభినందించారు.

పీఎం, సీఎం ఫోటోల ఏర్పాటు

కిర్లంపూడి, జూన్ 28: మండలంలోని పాలెం గ్రామంలో గ్రామ టీడీపీ నాయకుడు ఆళ్ల రవికిషోర్ ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జి పాటంశెట్టి మురళీకృష్ణ, పాలెం సర్పంచ్ అడబాల సుబ్బారాయుడు, అడబాల కొండబాబు కలిసి పంచాయతీ కార్యాలయంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఫోటోలను ఏర్పాటు చేశారు. ఆళ్ల శివబాబు, పాపారావు ఉన్నారు.

'బీమా పెంపు అభినందనీయం'

గొల్లప్రోలు రూరల్, జూన్ 28: చంద్రన్న బీమా పథకం ద్వారా ఇచ్చే పరిహారాన్ని రూ.5లక్షలు నుంచి రూ.10లక్షలకు పెంచడం అభినందనీయమని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ అన్నారు.

పింఛన్ల అవకతవకలపై విచారణ

కోటనందూరు, జూన్ 28: మండలంలోని కోట్టాం, ఎల్లీపేట గ్రామాల్లో పింఛన్ల విషయంలో అవకతవకలు జరిగాయని స్థానికులు డీఆర్డీఏకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఎంపీడీవో జయమాధవి ఆధ్వర్యంలో 2గ్రామాల్లో విచారణ చేపట్టారు. ఆధార్‌లో వయస్సు మార్పుతోనూ పింఛన్లు పొందడంతో సుమారు 100 మందిని విచారణ చేశారు.

'బాల్య వివాహాలు నేరం'

తాళ్లరేవు, జూన్ 28: బాలికలకు 18ఏళ్ల నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యనళిని అన్నారు. చినబొడ్డువెంకటాయపాలెం హైస్కూల్లో సీజనల్ వ్యాధులు, డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాల్యవివాహాలపై జిల్లా కళాజాతా బృందం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్, బీజేపీ మండలాధ్యక్షుడు దత్తాత్రేయవర్మ పాల్గొన్నారు.



బలహీనవర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూన్ 28: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘాల నేతలు శుక్రవారం సాయంత్రం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మూడోసారి ఘనవిజయం సాధించిన రాజప్పను పూలమాలలతో ముంచెత్తి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో బీసీ కార్పోరేషన్ ద్వారా నాయీబ్రాహ్మణులకు ఆదరణ వృత్తి పరికరాలు అందజేశామని గుర్తుచేసారు. నాయీబ్రాహ్మణులు వృత్తిపరంగా మరింత ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సీఎం మదిలో కార్యాచరణ ప్రణాళిక ఉందని చెప్పారు. సంఘ నాయకులు పా ల్గొన్నారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులో గల రాక్‌సిరామిక్ పరిశ్రమలో గత 75 రోజుల క్రితం విధుల నుంచి తొలగించిన కార్మికులను తిరిగి విధులలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వినతి పత్రం అందజేసారు. ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. తమకు ఏ నోటీసులు ఇవ్వకుండా అకారణంగా విధుల నుంచి తొలగించారని వాపోయారు.


రాజప్పను అభినందించిన నాయీబ్రాహ్మణులు

క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సర్పవరం జంక్షన్, జూన్ 28: విధి నిర్వహణలో బిజీగా ఉంటూ ఆరోగ్యంపై అశ్రద్ధ చేయరాదని, ఆరోగ్య సంరక్షణ కోసం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్పీ, ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎస్.సతీష్‌కుమార్ కోరారు. శుక్రవారం రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్‌లో కాకినాడ అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్స్, నాన్ వెజ్, ఆల్కహాల్ తదితర వాటికి దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వైద్య శిబిరం నిర్వహిస్తున్న అపోలో వైద్యులు అభినందనీయులని, ఏఆర్, సివిల్ పోలీసులకు ఈ సౌకర్యం లేదన్నారు. అపోలో హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ శివరామ్‌గాంధీ, డాక్టర్ వంశీ చైతన్య, డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో 127 మంది పోలీసు సిబ్బంది,కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. అసిస్టెంట్ కమాండెంట్ వీవీవీ సత్యనారాయణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ సునీల్, లేడీ మెడికల్ ఆఫీసర్ పి.లక్ష్మీదేవి, ఆర్ఐలు సురేష్‌బాబు, రవిశంకర్, ప్రభాకరరావు, గణేష్,రాము, సతీష్ పాల్గొన్నారు.

'ఆ నిర్ణయాలను రద్దు చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 28: జిల్లాలో పనిచేస్తున్న హమాలీపై గత ప్రభుత్వం తీసుకున్న వ్యతిరేక నిర్ణయాలను రద్దు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సివిల్ సప్లయిస్ హమాలీస్ యూనియన్ అధ్యక్షుడు తలాటం వీరవెంకటరావు కోరారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆయన వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో కాకినాడ, దివిలి, తుని, పిఠాపురం, గొల్లప్రోలు, జగ్గంపేట, వేళంగి మండల లెవల్ స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న వారికి పనిభద్రత కల్పించాలని పేర్కొన్నారు. రూట్ ఆప్టిమేషన్ పేరుతో రేషన్ షాపులను ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి కుదించి వేరొక పాయింట్లలో కలపడం వల్ల దివిలి, గొల్లప్రోలు హమాలీలు నష్టపోతున్నారని, రూట్ ఆప్టిమేషన్ విధానాన్ని రద్దుచేసి న్యాయం చేయాలని కోరారు. ప్రధాన కార్య దర్శి కొత్తం వెంకట శ్రీనివాస రావు, నాయకులు నాగేశ్వ రరావు, కరెడ్ల శ్రీను, రాంబాబు, సుబ్బారావు ఉన్నారు.

ఈ మక్కు రాళ్ల మాటేమిటి..!


కాకినాడలో గుట్టగా పడి ఉన్న భూరక్ష మక్కురాళ్లు

కాకినాడ సిటీ, జూన్ 28: జగనన్న భూరక్ష పేరిట నిధులు దుబారా చేసిన మక్కు రాళ్ల కాకినాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో గుట్టగా పడి ఉన్నాయి. కాకినాడ అర్బన్ పరిధిలోని మేడ లైన్‌లో రీ సర్వే చేసి హద్దులు చూపుతూ మక్కు రాళ్ల భూమిలో పాతడానికి తెచ్చారు. నాలుగేళ్లుగా మూలనపడి ఉన్న ఈ రాళ్ల ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఎందుకు ఉపయోగం లేకుండా పోయాయి. రాళ్ల మీద జగన్ బొమ్మతోపాటు వైఎస్సార్ జగనన్న భూ రక్ష రాళ్లు-2020 అని రాసి ఉంది. భూహక్కు, భూరక్ష పథకం కింద రీ సర్వే చేసి మక్కు రాళ్ల భూమిలో పాతడానికి కాంట్రాక్ట్ అప్పగించారు. ఈ రాళ్లను మేడలైన్ ప్రాంతానికి తీసుకెళ్లడానికి సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం భూహక్కు, భూరక్ష రీ సర్వే పనులను నిలిపివేయడంతో ఈ రాళ్లను ఏం చేయాలో తెలియక అధికారులు సందిగ్ధంలో పడ్డారు.

కొత్తపల్లి: వైసీపీ హయాంలో ప్రారంభించిన వైఎస్సార్ భూరక్ష ఆదిలోనే ఆగిపోయింది. మండలంలోని పలు గ్రామాల్లో రీసర్వే జరిగినా రైతుల నుంచి వచ్చిన వ్యతిరేకత, ఎన్నికల కోడ్ వల్ల ఎక్కడి సర్వే రాళ్లు అక్కడ వదిలేశారు.


కొత్తపల్లిలో భూ రీసర్వే రాళ్లు

మున్సిపల్ ప్రాథమిక పాఠశాల తరలింపు

సామర్లకోట, జూన్ 28: పట్టణ పరిధిలో జగ్గమ్మగారిపేటకు చెంది అన్న క్యాంటీన్‌లో కొనసాగుతున్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను తాత్కాలికంగా సత్యన్నారాయణపురం భరద్వాజాశ్రమ మున్సిపల్ పాఠశాలలో విలీనం చేసేందుకు తరలించినట్టు ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. కలెక్టర్ అన్న క్యాంటీన్‌కు భవనాన్ని అప్పగించాలని ఆదేశించడంతో డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో శుక్రవారం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, కౌన్సిలర్లతోనూ సమీక్ష నిర్వహించి ఎమ్మెల్యే చినరాజప్పకు వివరించిన మేరకు అందరికీ ఆమోదయోగ్యమైన సత్యన్నారాయణపురం పాఠశాలకు నిర్ణయించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం, జూన్ 28: కత్తిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి అవగాహన కల్పించారు. భోజనం సమయంలో చేతులు శుభ్రంగా కడగాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పలు జాగ్రత్తలను వివరించారు.

చిన్నారి చదువుకు దాత భరోసా

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

తొండంగి, జూన్ 28: మండలంలోని కొమ్మనాపల్లి గ్రామంలో ఇటీవల డయేరియాతో మృతిచెందిన నాగమణి కుమార్తెను చదివించేందుకు ఓ దాత ముందుకు వచ్చారు. ఈనెల 26న ఇద్దరు పిల్లల తల్లిని మింగిన డయేరియా శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తను చదివి తునికి చెందిన రోటరీక్లబ్ సెక్రటరీ కర్రి కిషోర్‌రెడ్డి ప్రస్తుతం రెండో తరగతి చదువుతున్న మృతురాలి పెద్దకుమార్తె లక్ష్మీ పావనిని ఇంటర్మీడియట్ వరకు చదివించేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం ఆయన మృతురాలి బంధువుల ఇంటికి వెళ్లి తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థలో లక్ష్మీ పావనినిని ఉంచి చదివించేందుకు అయ్యే మొత్తం ఖర్చును తాను భరిస్తానని, అదేవిధంగా రోటరీ క్లబ్ ద్వారా మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మరికొంతమంది దాతలు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

హౌసింగ్‌పై సమీక్ష నిర్వహించిన పీడీ

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 28: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నిర్మాణంలో గృహాలపై ఆ నియోజకవర్గానికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో పీడీ బి.సుధాకర్ పట్నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పరిష్కార వేదిక ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని సమస్యలు ఎలా పరిష్కరించాలనే అంశంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు డాక్టరేట్

గండేపల్లి, జూన్ 28: సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో ఐటీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఎ.లక్ష్మణరావు ఎన్ ఎఫిషియెంట్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఆండ్రాయిడ్ మాల్‌వేర్ డిటెక్షన్ అనే అంశంపై పరిశోధించి సమర్పించిన థీసిస్‌కు ఆంధ్ర యూనివర్శిటీ విశాఖపట్నం డాక్టరేట్ డిగ్రీ ప్రకటించిందని ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. లక్ష్మణరావును ఆదిత్య చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రొచాన్సలర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ రమాశ్రీ, మాకినీడి రాజబాబు అభినందించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

తాళ్లరేవు, జూన్ 28: ఉపాధిహామీ పనులపై గ్రామాల్లో అధికారులు శుక్రవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. తాళ్లరేవులో ఆశావర్కరు పింఛను తీసుకుంటున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కార్మికసంఘం నేత టేకుమూడి ఈశ్వరరావు గ్రామసభ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీనేతలు గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి శంకరనారాయణ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ప్రత్తిపాడు, జూన్ 28: మండలంలోని చినశంకర్లపూడిలో శుక్రవారం ఉపాధి పనులను టీడీపీ మండల నాయకుడు మిరియాల శ్రీను ప్రారంభించారు. గ్రామంలో కూలీలు వలస వెళ్లకుండా స్థానికంగానే వారికి ఉపాధి కల్పించడం కోసం ఈ ఉపాధి పనులు చేపట్టినట్లు వివరించారు. బద్దెటి శ్రీను, ఏనుగు సత్తిబాబు, బద్దెటి వెంకట్రావు, కర్రి దుర్గ, చనుబోయిన నాగేశ్వరరావు, మిరియాల వెంకట్రాజు పాల్గొన్నారు.

నాలుగు సిమెంట్ సోఫాల వితరణ

కరప, జూన్ 28: స్థానిక సీపీడబ్ల్యూ స్కీమ్ చెరువు చుట్టూ ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్‌లో వాకర్స్ విశ్రాంతి తీసుకొనే నిమిత్తం 4 సిమెంట్ సోఫాలను వితరణ చేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి తన తల్లి చంద్రావతి వర్ధంతి సందర్భంగా శుక్రవారం వీటిని ఏర్పాటు చేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్ ప్రారంభించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నక్కా వీరభద్రరావు, గ్రామస్తులు అనిశెట్టి ప్రసాద్, గొర్రెల కామేష్, మంచాల శ్రీను, మాధవరపు సన్నాలు, పప్పు శ్రీను, చిన్నారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరునికి అభిషేకం

ప్రత్తిపాడు, జూన్ 28: మండలంలోని రాచపల్లిలో అరుణాచలేశ్వర స్వామికి శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకంగా నేరుడుపండ్లతో సమకూర్చిన పండ్లరసంతో శివలింగంపై గంటపాటు అభిషేకం నిర్వహించారు. అపీత కుంచాబ అమ్మవారికి లలిత పారాయణ, మణిదీప వర్ణన, లలిత చాలీషా, విష్ణు సహస్రనామ పారాయణ, పంచాహారతులు నిర్వహించారు. రమణ సేవాశ్రమ రామానంద స్వామి ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్లకు పూజలు చేశారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT JUDGE :: KAKINADA

G.O.P. No. 36 / 2024

(Petition filed under the Guardian and Wards Act 1890 for Minor **Veturi Naga Sri Tripura Lakshmi Akshara**)

Between:

1) **Veturi Aparna**, W/o. Late Naga Satya Bharadwaj, aged 35 years, Hindu, R/o. D.No.1-42, Adapaka, Laveru, Srikakulam District.

2) **Veturi Venkata Radhamani**, W/o. Late Gopalakrishna Murthy, aged 62 years, Hindu, R/o. D.No.3-209/1, Rameswaram, Atchuthapurathrayam, Pedapudi Mandal, Kakinada District. ...Petitioners

and

Nil ...Resondent

పై నెంబరు పిటిషన్‌లో 1వ పిటిషనర్ గారి కుమార్తె మరియు 2వ పిటిషనర్ గారి మనుమరాలు అయిన **Veturi Naga Sri Tripura Lakshmi Akshara** మైనరు అయినందున పిటిషనర్స్ Veturi Aparna, Veturi Venkata Radhamaniలు గార్డియన్స్ అయి ఉండి, సదరు మైనరు యొక్క చదువు మరియు ఇతర ఖర్చుల నిమిత్తం ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని అమ్ముట కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున ఈ క్రింది తెల్పిన ఆస్తి విక్రయం గురించి ఎవరికైనా, ఏ విధమైన ఆక్షేపణలు లేదా అభ్యంతరములు ఉన్న యెడల ది.**05-07-2024** తేదీకి పైన తెల్పిన కోర్టులో ఉదయం **10.30** ని॥లకు హాజరయి ఆక్షేపణలు తెలియజేయవలెను.

SCHEDULE: Previously East Godavari District, Present Kakinada District, Pedapudi Mandal, Kakinada Sub-Registry, Atchuthapurathrayam outskirts, Rameswaram Gram Panchayat, Ziroyathi Dry S.No.63/5, Plot No.26 in a site of 435 sq.yds., eastern side site of 229.5 sq.yds. or 192.78 sq.mtrs in which RCC roof Daba with D.No.3-209/1 and Assessment No.902 situated within the following boundaries:

East: 69.00 ft or 20.93 mtrs. - After Prahari wall of this side land belongs to Madduri Venkata Rao, **West:** 69.00 ft or 20.93 mtrs. - Remaining site of Bandhakavi Pattabhi Ramarao which situated after Prahari Wall of this side, **North:** 29 ft 9 inches or 9.06 mtrs.-13 feet 2 inches wide Road, **South:** 29 ft 9 inches or 9.06 mtrs.-L.F. Audit and Zilla Parishad Employees Colony situated after Prahari Wall of this side.

Within the above bounded and measured site of 229.5 sq.yds. or 192.78 sq.mtrs., in which R.C.C. roof Daba House with entire fittings, roof, doors, doorways, electrical fittings, meter deposit No.14535-01116 000811, electrical service connection, Half HP Motor with common path ways entire easementary rights thereof.

(Un-divided and unspecified 1/3 share i.e an extent of 76.5 Sq Yds Plot No: 26 in a site of 435 Sq.Yards eastern side Site of 229.5 Sq.Yards or 192. 78 Sq.Mts in which R.C.C Roof Daba with D.No.3-209/1)

B.RAMALINGA SARMA
V.C.V.S.L.ANNAPURNA, Advocates
Near Sarpavaram Jn., Kakinada, Cell: 9948269699

పురపాలక సంఘం కార్యాలయము, పిఠాపురం

ఆర్.ఒ.సి.నెం.282/2024-ఇ1 తేది:28-06-2024

షార్ట్ టెండరు నోటీసు

పిఠాపురం పురపాలక సంఘంలో సాధారణ నిధుల నుండి ఈ దిగువనుదహరించిన పనులు రిజిస్టరు కాంట్రాక్టరుల నుండి సీల్డు బాక్సు టెండర్లు రూ.లక్ష లోపు విలువ గల వాటర్ సప్లై సంబంధించిన 4పనులకు అంచనా మొత్తం రూ.3.50 లక్షలు ఈ పురపాలక సంఘం కమీషనరు వారిచే గాని లేక వారిచే ఆమోదము పొందిన వారిచే గాని ది.5-7-2024వ తేది సాయంత్రం గం.4 లకు వరకు బాక్సు టెండర్లు రిజిష్టర్ కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు పురపాలక సంఘం కార్యాలయములో స్వీకరించబడి, అదే రోజు సాయంత్రం గం. 4.30ని.లకు అప్పటికి హాజరు అయిన టెండరుదారుల సమక్షమున తెరువబడును.

టెండర్లు స్వీకరించుటకు ఆఖరి తేది	: 5-7-2024 సాయంత్రం 4:00 వరకు
టెండరు షెడ్యూలు నిమిత్తం మున్సిపల్ ఖజానాలో చలానా రూపమున నగదు చెల్లించుటకు దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరి తేది.	: 3-7-2024 సాయంత్రం 04 గం.వరకు
టెండరు షెడ్యూల్సు యిచ్చు తేది	:4-7-2024 సాయంత్రం 04.గం. వరకు

ఇతర వివరములకు ఈ పురపాలక సంఘం ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించవలెను.

కమిషనరు
పిఠాపురం పురపాలక సంఘం